


రిజిస్ట్రేషన్లలో కాసుల దందా



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వ్యవసాయ భూములను నివాస స్థలాలుగా మార్పు చేసే రిజిస్ట్రేషన్లలో కాసుల దందా కొనసాగుతోంది. చట్టంలో ఉన్న లొసు గులను ఆసరా చేసుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లను కొనుగోలు చేసే వారికి మాయమాటలు చెప్పి తమపై పడుతున్న ఆర్థిక భారాన్ని కొనుగోలుదారులపై మోపుతున్నారు. దీంతో డీటీసీపీ లే అవుట్ లేకుండా ప్లాట్లను విక్రయించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతుండగా, కొనుగోలుదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఈ తంతు ఎక్కువగా పెద్దపల్లి, రామ గుండం, సుల్తానా బాద్, మంథని, కమాన్‌పూర్, అంతర్గాం, తదితర ప్రాంతాల్లో జరుగుతుండగా, అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూములను గుంటకు తక్కువ గాకుండా రెండు, మూడు, ఐదు గుంటలు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఆ తర్వాత భూమిని కొనుగోలు చేసిన వ్యక్తులే నాలా కన్వర్షన్ చేయించుకుని, అక్కడినుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి గజాల్లో మార్పిడి చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించు కుంటున్నారు. ఈ క్రమంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారుతు న్నాయి. వ్యవసాయ భూములను గుంటలు గుంటలుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అక్కడితో తమ పని పూర్తిచేసుకుంటున్నారు. విక్రయదా రులు దానిని నాలా కన్వర్షన్ చేయించుకునేందుకు తంటాలు పడుతున్నారు. కన్వర్షన్ కావాలంటే ఎంతో కొంత సొమ్ము ముట్ట జెప్పనిదే కన్వర్షన్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సదరు భూమి విలువను బట్టి కొందరు 5 నుంచి 10 వేలకు పైగా వసూలు చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ఇక్కడినుంచే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గజాలుగా మార్పు చేసుకునేందుకు అక్కడ కూడా చేతులు తడపక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది. ఇక్కడ 10 వేల నుంచి 50 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత చేసినా కూడా ప్లాట్ కొనుగోలు చేసిన వాళ్లు ఇంటి నిర్మాణానికి అనుమతులు పొందాలంటే నిబంధనల ప్రకారం రోడ్డు కోసం కావాల్సిన స్థలాన్ని వదిలి రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది.

- వ్యవసాయ భూములను నివాస స్థలాలుగా మార్పు
- నాలా కన్వర్షన్‌తో గుంటల్లో ఉన్న భూములు గజాల్లోకి..
- రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం
- కొనుగోలుదారులను ముంచుతున్న రియల్ వ్యాపారులు

కొనుగోలుదారులపైనే ఆర్థిక భారం..

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనధికారికంగా వెంచర్లు చేసి గుంటలుగా విక్రయించి కొనుగోలుదారులను నట్టేట ముంచుతున్నారు. వాస్తవానికి రియల్ వ్యాపారులు వెంచర్లు చేస్తే డీటీసీపీ అనుమతులతో పాటు 10 శాతం భూమిని మున్సిపల్, గ్రామపంచాయతీలకు పార్కులు, కమ్యూనిటీ అవసరాల కోసం వదిలిపెట్టాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేసి ఇంటర్నల్ రహదారులను 30 నుంచి 40 అడుగుల వరకు వదిలి పెట్టాల్సి ఉంటుంది. ఓ వైపు పన్నులు చెల్లించడంతో పాటు మరోవైపు భూమిని కోల్పోతుండటంతో పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లుతోందని భావించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధరణిలో ఉన్న లొసుగును ఆధారం చేసుకుని ప్లాట్లను విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకవచ్చిన ధరణి వెబ్‌సైట్ ప్రకారం గుంట స్థలాన్ని కూడా రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేస్తున్నారు. గతంలో 5 గుంటలకు మాత్రమే పాసు పుస్తకం ఇచ్చేవాళ్లు. నాలా కన్వర్షన్‌లో మార్పు లేదు. ఈ లొసుగును ఆధారం చేసుకుని రియల్ వ్యాపారులు గుంట, గుంటపావు, గుంటన్నర, రెండు, మూడు గుంటల వరకు ప్లాట్లు చేసి నామమాత్రంగా రోడ్లను వదిలి విక్రయిస్తున్నారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసే వారికి మాత్రం నాలా కన్వర్షన్ మొదలుకుని, సబ్ రిజిష్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ వరకు అందిన కాడికి దండుకుంటున్నట్లు ప్రచారం జరుగుతున్నది. వ్యవసాయ భూములను గుంటల్లో నుంచి గజాలకు నాలా కన్వర్షన్ చేయించిన తరువాత, అందులో కొంత భూమిని ఇతరులకు విక్రయించాలంటే మళ్లీ చేతులు తడపాల్సిందే. నాలా కన్వర్షన్ అయిన భూమి నుంచి కొన్ని గజాలను ఇతరులకు విక్రయించేందుకు కొత్త డాక్యుమెంట్ తయారుచేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొత్త డాక్యుమెంట్ తయారీ, రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యే వరకు 200 గజాల స్థలానికి భూమి విలువను బట్టి రూ.20 వేల నుంచి రూ.80 వేలకు పైగా ఖర్చవుతుందని సమాచారం. ఇందులో డాక్యుమెంట్ రైటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు వాటాలు ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి. పాత డాక్యుమెంట్‌ల కంటే కొత్త వాటికి 40 శాతం అదనంగా వసూలు చేస్తారని సమాచారం. ఈ క్రమంలో జిల్లాలో పలువురు సబ్ రిజిస్ట్రార్లు లంచాలు తీసుకుంటూ పట్టుబడిన సందర్భాలు కూడా ఉన్నాయి. మొత్తానికి వ్యవసాయ భూములను దొడ్డిదారిన కన్వర్షన్ చేయిస్తే ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండగా, అధికారులకు మాత్రం కాసుల పంట పండుతోందనే చర్చ జరుగుతోంది. ఈ విషయమై జిల్లా అధికార యంత్రాంగం స్పందించి అవినీతి అడ్డుకట్ట వేసి గుంటల్లో విక్రయాలు, వాటిని గజాలుగా మార్పు చేసే రిజిస్ట్రేషన్లపై నిఘా పెడితే డీటీసీపీ అనుమతులు లేకుండా ప్లాట్లు విక్రయిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల బాగోతాలు బయటపడతాయని పలువురు అంటున్నారు.

గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల పాఠశాలలు వసతి గృహాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అవసర మైన మౌలిక వసతుల కల్పన, చిన్నచిన్న పెండింగ్ పనులు పది రోజుల వ్యవధిలో పూర్తిచేయాలని సూచించారు. నైట్‌డ్యూటీ చేసే ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాస్టల్లో వద్ద విధులు నిర్వహించాలని, హాస్టల్ వార్డెన్లు 24 గంటల పాటు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహించి విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నాగలేశ్వర్, డీఈవో జనార్ధన్, సీడీపీవో కవిత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు జోహార్లు : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 11 : అటవీ అమరవీరులకు జోహార్లు, నివాళులర్పిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం కలెక్టరే ట్ ప్రాంగణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అటవీ అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బంది జోహార్లు అర్పి స్తూ అడవుల సంరక్షణకు అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. అనంతరం అటవీశాఖ సిబ్బంది చేపట్టిన ర్యాలీని కలెక్టర్ ప్రారం భించారు. అటవీశాఖ సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శివయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రామగుండం నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేయండి

- ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శిని కోరిన ఎమ్మెల్యే



ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, సెప్టెంబరు 11: రామగుండం నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేయాలని బుధ వారం ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యద ర్శి దాసరి హరిచందనను రామ గుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. బుధవారం ఆమె చాంబర్‌లో కలిసి రామగుం డం నియోజకవర్గంతో పాటు పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లకు తగినన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూ లంగా స్పందించిన హరిచందన రామగుండం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కాగా, రామగుం డంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంపై ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రటరీ మాణిరాజ్ కన్నన్‌ను రామగుం డం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మూతపడనున్న జెన్‌కో స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వల్ల రామగుండం లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. రామగుండానికి పూర్వవైభవం వస్తుందన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమయ్యే వనరుల కేటా యింపుపై వారు చర్చించారు. అనంతరం సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. సమస్యల పరి ష్కారానికి కృషి చేయాలని కోరారు.

నేటి నుంచి ఖని జనరల్ ఆసుపత్రిలో సదరం క్యాంపు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 11: గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం నుంచి వికలాంగుల కోసం సదరం క్యాంపును నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే మక్కా న్‌సింగ్ తెలిపారు. క్యాంపును గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిం చి వారికి సర్టిఫికెట్లను అందజేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ లీకేజీలపై భగ్గుమన్న రామగుండం కౌన్సిల్

- మేయర్ చాంబర్ ఎదుట బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల నిరసన - పావుగంట పాటు సమావేశం వాయిదా
- ఆర్‌ఎఫ్‌సీఎల్ వైఖరిని ఖండిస్తూ తీర్మానం - పీసీబీకి నివేదించాలని నిర్ణయం
- వీధి దీపాలపై నిలదీసిన కార్పొరేటర్లు - లక్ష్మీపురం నుంచి అల్లూరు వరకు బీటీ రోడ్డు



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

కోల్‌సిటీ, సెప్టెంబరు 11: ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడుతున్న అమ్మోనియా లీకేజీలపై రామగుండం నగర కౌన్సిల్ భగ్గుమన్నది. బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ఆర్ఎఫ్‌సీఎల్ వైఖరిని నిరసిస్తూ ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లకార్డులను ప్రదర్శిస్తూ మేయర్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో మేయర్ బంగి అనిల్‌కుమార్ సమావేశానికి 15నిమిషాలు వాయిదా వేశారు. సమావేశం ప్రారంభమైన తరువాత బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ఆర్ఎఫ్‌సీఎల్ లీకేజీలపై విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ పాముకుంట్ల భాస్కర్ 'ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎఫ్‌సీఎల్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన కథనాన్ని చదువుతూ కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ మేయర్ అభి షేక్‌రావుతో పాటు బీఆర్ఎస్ కార్పొరేటర్లు బొడ్డు రజిత, రాకం శ్రీమ తి తదితరులు కౌన్సిల్ సమావేశంలో ఆర్ఎఫ్‌సీఎల్ వైఖరిపై ఆగ్ర హం వ్యక్తంచేశారు. కాగా దీనిపై మున్సిపల్ డ్రైన్‌లోకి అమ్మోనియా వ్యర్థాలను వదిలిన రోజే తాము ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సూచనలతో పరిశీలన చేశామని, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యానికి కూడా గట్టిగా అభ్యంతరం చెప్పినట్టు తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్ వైఖరిని గర్హిస్తూ భవిష్యత్‌లో వ్యర్థజలాలు బయటకు రాకుండా చూసుకోవాలని, బ యటకు పంపితే చట్టపరమైన చర్యలు తీసకునేందుకు తీర్మానించా రు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, బీఆర్ఎస్, బీ జేపీ కార్పొరేటర్లు కన్నూరి సతీష్‌కుమార్, కౌశిక లత, కిషన్‌రెడ్డి తది తరులు లేబర్‌సొసైటీపై ప్రశ్నించారు. మూడేళ్లుగా ఎన్నికలు లేవని, నిధులపై స్పష్టత లేదని ప్రశ్నించారు. నెల రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీకాంత్ హామీ ఇచ్చారు. తన డివిజన్ లో అభివృద్ధి పనులు చేయడం లేదని కార్పొరేటర్ నగునూరి సుమ లత మేయర్ పోడియం ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. మరో కార్పొరేటర్ గాదం విజయ అభివృద్ధి చేయకపోతే తాను ఆత్మ హత్య చేసుకుంటానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశం లో కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలకు సంబంధించి మార్చి 2025 వరకు పాలనపరమైన ఆమోదం లభించింది. మేయర్ తో పాటు కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఈ ఎస్, ఈఈలు, డీఈలు, ఏసీపీ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ పేర మొ త్తం 12కార్లు అద్దెకు తీసుకునేందుకు తీర్మానించారు. కార్పొరేషన్‌లో రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకో వాలని తీర్మానించారు. కార్పొరేషన్‌పరిధిలో ప్రతి ఇంటికి ఒక మొక్క పెంచాలని తీర్మానించారు. అలాగే తడి, పొడి చెత్త వేరు చేయడం తోపాటు రోడ్లు, కాలువల్లో చెత్త పడవేసే వారిపై జరిమానా విధిం చాలని నిర్ణయించారు. గోదావరిఖని కోర్టుల్లో కేసులు వాదించినందు కు లైజనింగ్ అధికారి పాత అశోక్‌కు బిల్లు చెల్లింపునకు తీర్మానిం చారు. గోదావరిఖని మెయిన్‌చౌరస్తా నుంచి మున్సిపల్ జంక్షన్ వర కు అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులు తొలగించాలనే ప్రతిపాదనపై కౌన్సిల్ సమావేశంలో చర్చించారు. 17ఏళ్ల కాలపరిమితపై గతంలో కౌన్సిల్ తీర్మాణం లేకుండా టెండర్ ఇచ్చారని, కౌన్సిల్‌కు ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యా లయంలో రూ.15లక్షల సీడీపీ నిధులతో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర సామగ్రి కొనుగోలుకు తీర్మానించారు. జనగామ శివారు సర్వే నెం.599 రెసిడెన్షియల్ జోన్‌లో ఉందని, దానిని కమర్షియల్ జోన్‌గా మార్చేందుకు తీర్మానించారు.

టీయూఎఫ్ఐడీసీ ఏజెన్సీకి రూ.కోటి బిల్లు చెల్లింపునకు ఆమోదం

టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.100కోట్లతో చేపట్టనున్న పనులకు సంబంధించి డీపీఆర్ తయారుచేయడానికి ఎంపికైన మెస్సర్స్ ఎస్‌కే అసోసియేట్స్, హైదరాబాద్‌కు 1.07కోట్లు బిల్లు చెల్లింపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ నిధుల ద్వారా ఏజెన్సీకి కేవలం 0.7శాతం నిధులు చెల్లించే వెసులుబాటు ఉందని, ఎస్‌కే అసోసియేట్స్ 1.4 శాతం కోడ్ చేసినందున కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.47.12లక్షలు చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

రోడ్ల వెడల్పునకు తీర్మానం

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ ప్రాంతాల్లో రోడ్ల వెడల్పు చేసేందుకు తీర్మానం చేశారు. ఎంత వెడల్పు అనే విషయం పొందుపర్చకుండానే ప్రతిపాదన పెట్టారు. ఓల్డ్ అశోక థియేటర్ నుంచి సాయి జువెల్లర్స్ మార్కండేయకాలనీ గణేష్‌నగర్ బోర్డు నుంచి విజయ పిల్లల హాస్పిటల్, రీగల్ షూమా ర్టు నుంచి బాలాజీ స్వీట్ హౌస్, రాజేష్‌శర్మ ఇంటి నుంచి బాలాజీ స్వీట్‌హౌస్, కళ్యాణ్ మెయిన్‌రోడ్డు నుంచి ప్రాఫిట్ షూమార్ట్, స్వతం త్ర చౌక్ నుంచి పాత మున్సిపల్ ఆఫీస్, రీగల్ షూమార్ట్ జంక్షన్ అభివృద్ధికి తీర్మాణించారు. అలాగే స్థానిక 14వ డివిజన్ లక్ష్మీపురం నుంచి అల్లూరు రోడ్డు వరకు 30 అడుగుల బీటీ రోడ్డు వేసేందుకు కలెక్టర్‌కు నివేదిస్తూ తీర్మానించారు.

మాతంగి నర్సయ్య, మాలెం మల్లేషం విగ్రహాలు...

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో గౌతమినగర్‌జంక్షన్‌లో మాజీ మంత్రి మాతంగి నర్సయ్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఎ మ్మెల్యే రాజ్‌ఠాకూర్ సూచనతో తీర్మానం చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేషం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీఆర్ ఎస్ కార్పొరేటర్ ముదాం శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు వంగ శ్రీని వాస్, ఎండీ రఫీలు విజ్ఞప్తి చేసిన మేరకు తీర్మాణాన్ని పెట్టారు. కాం గ్రెస్ కార్పొరేటర్ బొంతల రాజేష్ మల్లేషం విగ్రహాన్ని తిలక్‌నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కళాకరుడు జాకబ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

వీధి దీపాలు లేక ప్రజలు ఛీ కొడుతున్నారు : సతీష్, కార్పొరేటర్

రామగుండం నగరపాలక సంస్థలో వీధి దీపాలు లేక ప్రజలు ఛీ కొడుతున్నారు. వీధి దీపాల నిర్వహణ లేకపోవడంతో కార్పొరేషన్ పరిధిలో రోడ్లు చీకటిమయం అవుతున్నాయి. అధికారులు ఫోన్లు కూడా ఎత్తడం లేదు. సంబంధం లేదంటూ చేతులెత్తేస్తున్నారు. డి విజన్ పరిధిలో మంచినీరు, డ్రైనేజీ వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదు.

ఆర్ఎఫ్‌సీఎల్ జలాలతో ప్రాణాలకు ముప్పు : భాస్కర్, కార్పొరేటర్

ఆర్ఎఫ్‌సీఎల్ వదులుతున్న విష జలాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. నాలుగు రోజుల క్రితం నా డివిజన్‌లోని మురు గు కాలువలోకి ఆర్ఎఫ్‌సీఎల్ అమ్మోనియా వాటర్‌ను వదిలింది. దీంతో కళ్ల మంటలు, శ్వాస ఆడక ప్రజలు నరకం అనుభవించారు. ఆర్ఎఫ్‌సీఎల్‌ను కట్టడి చేయాలి. ఇప్పటి వరకు జెడ్‌ఎల్‌డీ పెట్టకుం డా తాత్సారం చేస్తోంది.

ప్లకార్డులతో షోలు : కాంగ్రెస్ కార్పొరేటర్ స్వామి

రామగుండం అభివృద్ధిని తొమ్మిదేళ్ల పాటు పట్టించుకోకుండా ద్రో హం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు ప్లకార్డులతో షో చేస్తుందని కార్పొరే టర్ మహంకాళి స్వామి ఆరోపించారు. ఈఈఎస్ఎల్ సంస్థ కేటీఆర్ భాగస్వామి అన్నారు. పట్టణప్రగతి నిధులనుఇవ్వకుండా ద్రోహం చేసింది బీఆర్ఎస్సేనని, ఆర్ఎఫ్‌సీఎల్‌లో జరుగుతున్న ఇబ్బందుల కు ఆ పార్టీ ప్రభుత్వం చేసిన నిర్వాకమే కారణమన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు : మేయర్

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధిపనులు చురుగ్గా సాగు తున్నాయని మేయర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. యూటీఎఫ్ఐడీ సీ, అమృత్‌పనులతో పాటు కొత్తగా రూ.8000కోట్లతో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం విస్తరణకు కూడా ఆమోదం లభించిందన్నారు. కమిషనర్ శ్రీకాంత్, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

శ్రీపాద ఎల్లంపల్లికి కొనసాగుతున్న వరద

పెద్దపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు 43,444 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో వరద నీటిని అంచనా వేస్తూ 6 గేట్ల ద్వారా 43,034 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.619 టీఎంసీల నీళ్లు వస్తున్నాయి.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 11: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో 2024-25 విద్యాసంవత్సరానికి తెలుగు(1), కెమిస్ట్రీ(1) సబ్జెక్టు లు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్‌ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు బయోడేటా, విద్యార్హతలతో ఈనెల 16వ తేది సాయంత్రం 4.30 వరకు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు లు అందజేయాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



డిగ్రీ విద్యార్థులకు ఆర్బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

కొడిమ్యాల, సెప్టెంబరు 11: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలను ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్ తెలిపారు. మండలంలోని పూడూర్‌లో బుధవారం ఎఫ్ఎల్సీ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ స్థాపించి 90 సంవత్సరాల్లో అడుగు పెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. క్విజ్ పోటీలు జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో ఉంటాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. విజేతలైనవారు లక్ష రూపాయల నుంచి 10 లక్షల రూపాయల వరకు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఒక కళాశాల నుంచి ఎంత మంది విద్యార్థులైనా పాల్గొనటానికి అవకాశం ఉందన్నారు. ఒక బృందంలో ఇద్దరు సభ్యులు ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 17లోగా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఆర్బీఐ 90క్విజ్.ఇన్‌వెబ్‌సైట్ లాగిన్ అయి నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న మధుసూదన్

మిస్సింగ్ కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 11: సిరిసిల్ల పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన చాట్ల సుశాంక్ అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లిపోయాడని తల్లి రచన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన కోడం గంగాధర్ (53) అనే బీడీ టేకేదారు అదృశ్యమైనట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గంగాధర్ తిరిగి రాలేదని అతడి కుమారుడు ప్రేమ్‌సాగర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్‌యూ డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 11: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్, జూన్-2024లో నిర్వహించిన డిగ్రీ (సీబీసీఎస్, రెగ్యులర్ బ్యాక్‌లాగ్)2, 4, 6వ సెమిస్టర్ రీవాల్యుయేషన్ పరీక్షల ఫలితాలను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.


గంజాయి మొక్క సాగుపై కేసు

గంగాధర, సెప్టెంబరు 11: గంగాధర మండలం వెంకంపల్లి పరిధిలో బుధవారం గంజాయి మొక్కను గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఫౌల్ట్రీ ఫాం షెడ్డులో పనిచేస్తున్న ఇతర రాష్ట్ర కూలీలలు గత కొద్ది కాలంగా గంజాయి మొక్కను సాగు చేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఫౌల్ట్రీలో తనిఖీలు నిర్వహించగా గంజాయి చెట్టును గుర్తించినట్లు తెలిపారు. వ్యవసాధికారులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.















మీడియా పేరుతో అక్రమాలు

● మహిళ అరెస్ట్

వేములవాడ, సెప్టెంబర్ 11: మీడియా పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వేములవాడ మండలంలోని చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన చొక్కారాపు వనజ అనే మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వేములవాడ ఏఎస్‌పి శేషాద్రినిరెడ్డి తెలిపారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను బుధవారం వివరించారు. వనజ కొంతకాలంగా తాను ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్నానని గ్రామాల్లోని యువతకు మోసపూరితమైన మాటలు చెప్పి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని చెప్పారు. మీడియాలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తానని, అక్రిడిటేషన్ కార్డులు ఇప్పించడమే కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ప్లాట్లు, ప్రభుత్వ అసైన్డ్ భూములను కూడా ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతుందని చెప్పారు. ఇందులో భాగంగానే 2019 సంవత్సరంలో చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన చంద్రయ్య అనే వ్యక్తి నుంచి 16 లక్షల రూపాయలు, రామన్నపేటకు చెందిన రైతు ఆరుట్ల ఆది మల్లయ్యకు మూడు ఎకరాల వ్యవసాయ భూమిని తంగళ్లపల్లి మండలం ఆరంపల్లి వద్ద ఇప్పిస్తానని నమ్మించి పది లక్షల రూపాయలను తీసుకొని మోసానికి పాల్పడింది. మోసాలకు పాల్పడుతున్న వనజకు సహకరించిన మల్యాల గ్రామానికి చెందిన పీసరి శ్రీనివాస్, వనజలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఏటా తప్పని ప్రయాణ తిప్పలు

● జవారిపేటలో వర్షాకాలం ఇబ్బందులు ● హామీలకే పరిమితమైన వంతెన నిర్మాణం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 11: భారీవర్షం కురిసిందంటే తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో ఇబ్బంది పడటం జవారిపేట గ్రామవాసులకు సర్వసాధారణంగా మారిపోయింది. జవారిపేట, నర్సక్కపేట గ్రామాలలోని బిక్కవాగుపై ఉన్న లోలెవల్ వంతెన నాలుగు సంవత్సరాల క్రితం కురిసిన భారీవర్షాలతో కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన వంతెన ప్రాంతంలో పైపులు వేసి తాత్కాలిక రోడ్డు వేశారు. ప్రతి సంవత్సరం వర్షాలకు తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోతోంది. దీనితో గ్రామానికి ఆర్టీసీ బస్సులు నిలిచిపోతాయి. అనేక మంది విద్యార్థులు, వ్యాపారస్తులు ప్రతి రోజు నర్సక్కపేట గ్రామం వరకు నడిచివచ్చి బస్సులు ఎక్కి కరీంనగర్ వెలుతుంటారు. గత సంవత్సరం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని శిలాఫలకం వేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. శిలాఫలకం మాత్రం ధ్వంసం అయింది. దీనిపై ఏ.కిరణ్‌ను వివరణ కోరగా లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన కావాలని కోరడంతో ఆలస్యం జరిగిందన్నారు.



తెగిపోయిన జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్యలోని రోడ్డు

హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి


● ఎ కిరణ్, జవారిపేట



జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్యలోని బిక్కవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి. ఇక్కడ వాగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ప్రతి సంవత్సరం వర్షాలకు కొట్టుకుపోవడం సాధారణంగా మారింది. గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లాం.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం..

- డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే



గత ప్రభుత్వ వైఫల్యం వల్లనే జవారిపేట గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. శిలాఫలకం వేసిన వారు పనులు ఎందుకు ప్రారంభించలేదు. ప్రస్తుతం హైలెవల్ వంతెన నిర్మాణం కోసం ఎస్టిమేషన్లు వేసి రాష్ట్రమంత్రి దృష్టికి తీసుకపోయాం. త్వరలోనే నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభిస్తాం.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి జైలు

వేములవాడ, సెప్టెంబర్ 11: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులకు వేములవాడ న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం తెలిపారు. 2016 సంవత్సరంలో జాతర గ్రౌండ్ వద్ద విధులు నిర్వహిస్తున్న శ్రీకర్ అనే కానిస్టేబుల్ ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తుండడం గమనించి వారిని ఆపి తనిఖీ చేయడానికి ప్రయత్నించగా ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు కానిస్టేబుల్‌పై దాడి చేసి గాయపరిచిన ఎండి రహీముద్దీన్, కూసం మధు, సంటి మహేశ్ అనే వ్యక్తులపై కేసు నమోదు అయిందని తెలిపారు. దీనిపై న్యాయస్థానంలో విచారణ జరిపిన న్యాయమూర్తి జ్యోతిర్మయి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

బాకీ చెల్లించలేదని రైతుపై దాడి

ముత్తారం, సెప్టెంబరు 11: బాకీ తీర్చలేదని రైతుపై ఫర్టిలైజర్ షాపు యజమాని బుధవారం దాడి చేసి గాయపరిచాడు. మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన నిమ్మతి శ్రీనివాస్ అనే రైతు అదే గ్రామానికి చెందిన పరికిపండ్ల విద్యాసాగర్‌కు చెందిన ఫర్టిలైజర్ షాప్‌లో పత్తి, వరి పొలానికి ఎరువులు కొనుగోలు చేశాడు. ఇందుకు సుమారు 20వేల రూపాయలు బాకీ ఉన్నాడు. బాకీ చెల్లింపులో జాప్యం చేస్తున్నావంటూ రైతు శ్రీనివాస్‌పై మండల కేంద్రంలోని కాసర్లగడ్డ వద్ద షాపు యజమాని విద్యాసాగర్ కర్రతో తల, చేతులపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

సుల్తానాబాద్, సెప్టెంబరు 11 : సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కల్వల సుదర్శన్(57) అనే వ్యక్తి పదిరోజుల క్రితం అదృశ్యమయ్యాడు. దీనిపై అతడి భార్య పోలీసులకు సమాచారం అందించింది. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చెందిన క్వార్టర్‌లో సుదర్శన్ ఆత్మహత్య చేసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు మండల పరిషత్ క్వార్టర్ల వద్దకు బుధవారం రాత్రి చేరుకొని చూడగా ఆత్మహత్యకు పాల్పడింది సుదర్శన్ అని గుర్తించారు. పదిరోజుల క్రితమే ఇంటినుంచి వెళ్లిపోయిన సుదర్శన్ అదేరోజు మండల పరిషత్ క్వార్టర్ల వెనుకభాగంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే బుధవారం రాత్రి ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

14న కరీంనగర్ అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం

● బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు11: నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఈ నెల 14న ఉదయం 11గంటలకు ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు సర్వసభ్య సమావేశానికి సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. గత పాలకవర్గం సర్వసభ్య సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారని, ఇప్పుడు ఆ విధానానికి స్వస్తిపలికి సభ్యుల, ఖాతాదారుల సాధక బాధకాలను తెలుసుకొని అందరి సమక్షంలో నిర్ణయాలను ఈ సమావేశాల్లో తీసుకుంటామని చెప్పారు. కరీంనగర్ సహకార బ్యాంకుకు కరీంనగర్ మెయిన్ బ్రాంచ్‌తో పాటు జగిత్యాలలో బ్రాంచి ఉందన్నారు. త్వరలోనే గంగాధర ఎక్స్‌రోడ్‌లో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమయం తీసుకొని ఆయన చేతుల మీదుగా నూతన బ్రాంచ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, విద్యా సాగర్, లక్ష్మన్‌రాజు, సందీప్, రవీందర్‌రెడ్డి, బ్యాంకు సీఈవో నునుగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

కొండగట్టులో బాలుడి కిడ్నాప్ యత్నం

● మహిళను పట్టుకున్న స్థానికులు

మల్యాల, సెప్టెంబరు 11: దిగువ కొండగట్టులో బాలుడి అపహరణకు ఓ మహిళ యత్నించింది. దీంతో గమనించిన స్థానికులు మహిళను పట్టుకుని మల్యాల పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. దిగువ కొండగట్టులో నివాసముంటున్న తులసీ-సాయికృష్ణ కుమారుడు విక్కీ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. కొండగట్టు గుట్ట పైకి వెళ్లే దారి కావడంతో అటు వైపు వచ్చిన మహిళ బాలుడిని లాక్కొని వేగంగా వెలుతూ అపహరణకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు మహిళను పట్టుకున్నారు. బాబును కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మహిళను మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. అయితే ఆ మహిళ తీరును బట్టి చిన్నారులను ఎత్తుకెళ్లే ముఠాగా స్థానికులు అనుమానిస్తున్నారు. సదరు మహిళ బుధవారం మరికొందరు మహిళలతో కొండగట్టుకు వచ్చినట్లు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 11: కరీంనగర్‌లోని కమాన్ నుంచి హౌజింగ్ బోర్డు కాలనీకి వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి దాసరి చరణ్(21) దుర్మరణం చెందాడు. మారుతీనగర్‌కు చెందిన చరణ్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సెలవుల కారణంగా వారం కిందట కరీంనగర్‌కు వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి చరణ్ స్నేహితుడు ప్రదీప్ ఫోన్ చేసి తనను బస్టాండ్‌లో దించాలని కోరగా చరణ్ తన ద్విచక్ర వాహనంపై దింపాడు. తిరిగి కమాన్ నుంచి మారుతీనగర్‌లోని ఇంటికి బైక్‌పై అతివేగంగా వస్తుండగా భారత్ పెట్రోల్‌బంక్ వద్ద బైక్ అదుపుతప్పి సిమెంట్ పోల్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు పరీక్షించి మృతి చెందాడని వెల్లడించారు. తన కొడుకు అతివేగంగా బైక్ నడపటంతో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడని మృతుడి తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.



దాసరి చరణ్(ఫైల్)

సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థికి పాముకాటు

సుల్తానాబాద్, సెప్టెంబరు 11: సుల్తానాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బీ మన్విత్ అనే విద్యార్థిని బుధవారం పాము కాటేసింది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన మన్విత్ గురుకుల హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లగా విద్యార్థి మన్విత్‌ను పాము కాటువేసింది. విద్యార్థులు కేకలు వేయడంతో హాస్టల్ సిబ్బంది మన్విత్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

పంట చేలల్లోకి భారీగా వరద నీరు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 11: ఇటీవల కురుసిన భారీ వర్షాలకు వాగులు, చెరువులు, కుంటలు, అలుగులు పారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి గోదావరి నదికి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా నీటిని వరద కాలువలోకి వదలడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు మండలంలోని ఆత్మనగర్ గ్రామ పెద్ద తండా సమీపంలోని వరి పంట చేలల్లోకి భారీగా చేరింది. దీంతో కొన్ని పంట పొలాలు చెరువులను తలపించేలా మారాయి. ప్రధాన ప్రాజెక్టు ఎస్సారెస్పీలోకి పూర్తి స్థాయిలో నీరు చేరుకుంది. దీంతో అధికారులు 19వేల క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మండలంలోని మాన్వార్ వాగు ఇప్పటికే ఉధృతంగా ప్రవహిస్తోంది. మాన్వార్ వాగులోకి వరద కాలువ చేరి మరింత ప్రవహం పెరిగి నీరంతా వెనకకు రావడంతో ఆత్మనగర్ పెద్దతండా వద్ద జరుపుల పవన్‌నాయక్, శంకర్, రాజేశ్వర్‌లతో పాటు పలువురి రైతులకు చెందిన సుమారు 25 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగాయి. ఇలాగే వరద కాలువ ప్రవాహం కొనసాగితే మరిన్ని పంట పొలాలు నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందించాలని కోరుతున్నారు.



ఆత్మనగర్‌లోని వరద కాలువ నీటితో మునిగిన పంట పొలాలు

భార్యకాపురానికి రావడంలేదని ఆత్మహత్య

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 11: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన చిలుకరవి (43) అనే వ్యక్తి తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మూడు నెలల క్రితం రవిని వదిలి అతడి భార్య గౌతమి ఇంటినుంచి వెళ్లిపోయింది. దీంతో రవి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో రవి జీవితంపై విరక్తి చెంది తన ఇంటిముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు రవి తల్లి అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదివాసీలపై అన్యాయంగా కేసులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 11: ఆదివాసీలపై పోలీసులు అన్యాయంగా కేసులు పెట్టారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ అన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఇటీవల జరిగిన గొడవల్లో అరెస్టు అయిన 10 మందిని కరీంనగర్ జిల్లా జైలులో ఉంచారు. వారితో కుటుంబ సభ్యులు, హైకోర్టు న్యాయవాదులు, బీజేపీ నాయకులు కరీంనగర్ జైలులో బుధవారం ములాఖత్ అయ్యారు. అనంతరం ఆదివాసీలతో కలిసి బీజేపీ నాయకులు కరీంనగర్ జైలు బయట మీడియాతో మాట్లాడారు. గత నెల 31న ఆదివాసీ మహిళ తన సోదరునికి రాఖీ కట్టి ఇంటికి వస్తుండగా ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించి తీవ్రంగా కొట్టాడన్నారు. ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించి నిందితుడు పారిపోయాడని, ఆ తరువాత మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని బంధువులకు తెలిపిందన్నారు. నిందితుడు గతంలో ఓ గిరిజన మహిళ భర్తను హత్య చేసి ఆమెను లోబర్చుకున్నాడన్నారు. అదే వ్యక్తి మళ్లీ ఇప్పుడు అఘాయిత్యానికి పాల్పడటంతో గొడవలు చెలరేగాయన్నారు. 10 మంది ఆదివాసీలను అన్యాయంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. జైలులో వారితో మాట్లాడేందుకు వచ్చామని, వారికి బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.



కరీంనగర్ జిల్లా జైలు ఎదుట మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దినసరి కూలీ అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 11: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన దినసరి కూలీ ఉత్తర్ల రాజేందర్ అదృశ్యమయ్యాడని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని రాజేందర్ భార్య రేణుక బుధవారం తెలిపింది. గ్రామంలోని రాజేందర్ నిత్యం కూలీ పనుల కోసం చీర్లవంచ గ్రామానికి వెళ్లి వచ్చేవాడని పేర్కొంది. మూడు నెలల కిందట ఇంటి నుంచి కూలీ పనులకు వెళ్లిన తన భర్త రాజేందర్ ఇంటికి తిరిగి రాలేదని చెప్పింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంది.

మూడు నెలలుగా వెతికినా ఆచూకీ లభించలేదని వాపోయింది. గతంలోనూ పలుమార్లు అదృశ్యమై తిరిగి ఇంటికి వచ్చాడని తెలిపింది. తన భర్త అదృశ్యంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని రేణుక పేర్కొంది.

తృటిలో తప్పిన ప్రమాదం



అర్కండ్ల వాగుపై నీటి ప్రవాహంలో ప్రమాదకరంగా నిలిచిన కారు

శంకరపట్నం, సెప్టెంబరు 11: మండలంలోని అర్కండ్ల బ్రిడ్జిపై కారు అదుపుతప్పి బ్రిడ్జి కిందకి దూసుకెళ్తుండగా డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కారు అర్కండ్ల లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా నీటి ప్రవాహానికి బ్రిడ్జి కిందకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బ్రేక్ వేయడంతో ముందు టైరు బ్రిడ్జి కిందకి జారి కారు ముందు భాగం బ్రిడ్జికి తగిలి అక్కడే ఆగడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కారులో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

మల్లన్న సన్నిధిలో సినీ నటుడు శివారెడ్డి పూజలు



మల్లన్నకు పూజలు నిర్వహిస్తున్న శివారెడ్డి

ఓదెల, సెప్టెంబరు 11 : ఓదెల మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి సన్నిధిలో సినీ నటుడు, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి పూజలు నిర్వహించారు. బుధవారం శివారెడ్డితో పాటు బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు రవికాంత్ ప్రదీప్‌కుమార్, ఎన్నారై దుర్గ ప్రసాద్, ప్రముఖ ఆర్టిస్ట్ భాస్కర్, వాసు, కేఎస్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో సుధాకర్, సిబ్బంది వారిని సన్మానించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11: మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులోని కీర్తన, శ్రీ కీర్తన ఫౌల్ట్రీ ఫాంలలో అక్రమంగా నిల్వ ఉంచిన 108 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడులు చేసి బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ శివారులోని రెండు ఫౌల్ట్రీ ఫాంలలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్‌తో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా నిల్వ ఉన్న 108 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ఫౌల్ట్రీ ఫాం యాజమానులు గుజ్జే గంగాధర్, అంకతి రాజలింగం, ఆటో యాజమానులు కొండపల్లి కాంచెట్టి, సద్దుల సతీష్‌పై తో పాటు పరారీలో ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



వేములకుర్తిలో ఫౌల్ట్రీ ఫాంలో బియ్యం పట్టుకున్న సిఐ నిరంజన్‌రెడ్డి

● మెట్‌పల్లిలో 20 క్వింటాళ్ల బియ్యం సీజ్

మెట్‌పల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకుని 20 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మెట్‌పల్లి మండలం వెంపేట గ్రామం నుంచి ఆర్మూర్‌కు అక్రమంగా బియ్యం తరలిస్తుండగా పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఒకరిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి: మండలంలోని అంకుసాపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ సీఐ మొగిలి తెలిపారు. మంగళవారం రాత్రి అంకుసాపూర్‌లో బియ్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు ఎస్సై సుధాకర్ దాడులు నిర్వహించారని, వ్యాన్‌లో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారని తెలిపారు. బియ్యం తరలిస్తున్న తంగళ్లపల్లికి చెందిన సరుగు బాలయ్య, కొనుగోలు చేస్తున్న జిల్లెల్ల గ్రామానికి చెందిన పాండుపై కేసు నమోదు చేశామన్నారు.

● వీణవంక: మండలంలోని శ్రీరాములపేటలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామనికి చెందిన అంగిడి సుధాకర్, లోకిని శ్రీనివాస్‌లు గ్రామాల్లో తిరుగుతూ 12 రూపాయల చొప్పున కొని ఇతర ప్రాంతాల్లో 17 రూపాయలకు అమ్ముతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

భూషణ్‌రావుపేటలో రైతు ఆత్మహత్యాయత్నం

● రుణమాఫీ కాకపోవడంతోనేనని బీఆర్‌ఎస్ ఆరోపణ



చికిత్స పొందుతున్న రైతును పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జగిత్యాల/కథలాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట గ్రామానికి ఏనుగు సాగర్‌రెడ్డి (46) అనే రైతు బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాగర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం కథలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాగర్‌రెడ్డి ఆరోగ్యం విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. రైతు రుణమాఫీ కాకపోవడంతోనే సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. చికిత్స పొందుతున్న సాగర్‌రెడ్డిని బీఆర్‌ఎస్‌కు చెందిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ తదితరులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ మాట్లాడుతూ గత నెల 20న బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కథలాపూర్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న సాగర్‌రెడ్డి తనకు రుణమాఫీ కాలేదని ఆవేదన చెందుతూ పురుగుల మందు తాగే ప్రయత్నం చేశాడని వివరించారు. అప్పుడు తాము అడ్డుకున్నామని తెలిపారు. ఇప్పుడు రుణమాఫీ కాలేదని, తనకు అప్పులు మిగిలాయన్న బాధతో రైతు సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. రుణమాఫీ జరగకున్నా కనీసం ఆసుపత్రిలో సరియైన వైద్యం సైతం రైతుకు అందించే పరిస్థితి లేదని విమర్శించారు.

కాంగ్రెస్ పాలనలో రైతుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అబద్దపు పునాదుల మీద రేవంత్‌రెడ్డి పాలన నడుస్తోందని విమర్శించారు. రుణ మాఫీ జరిగిందని సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం సంఘటనపై ఏమీ సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఒల్లం మల్లేశం, నాయకులు దయ్యాల మల్లారెడ్డి, పడిగెల గంగారెడ్డి, హరీశ్, ప్రణయ్, నీలి ప్రతాప్, మణికంఠ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 11: తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ముకుందలాల్‌మిశ్రా భవన్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. 13న తెలంగాణ చౌక్ నుంచి అనభేరి ప్రభాకర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ, 15న జిల్లా సదస్సు, 17న గ్రామాల్లో సెమినార్లు, సభలు నిర్వహించాలన్నారు. దేశ సంపదను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమ్మివేస్తోందన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాల మూలంగా నష్టాన్ని జాతీయ విపత్తుగా పరిగణించి నష్టపరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, సత్యం, బీమా సాహెబ్, సంపత్, అశోక్, డినరేష్, తదితరులు పాల్గొన్నారు.

కొడుకులు చేరదీయడం లేదని ఠాణాకు చేరుకున్న వృద్ధురాలు

ఇల్లందకుంట, సెప్టెంబరు 11: కుమారులు కూడు పెట్టడం లేదంటూ ఓ తల్లి ఠాణాకు చేరుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన ఉడుత కొమురమ్మకు ఐదుగురు కుమారులు, ఒక కూతురు ఉంది. భర్త సింగరేణి ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన తర్వాత మృతి చెందాడు. కొమురమ్మ సొంత గ్రామమైన పర్లపల్లిలో ఉంటుంది. ఐదుగురు కొడుకులకు గాను ఇద్దరు సింగరేణి ఉద్యోగం చేస్తుండగా, ఒకరు చనిపోయారు. మరో ఇద్దరిలో ఒకరు ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో ఉండగా, మరొక అతను జమ్మికుంటలో ఉంటున్నాడు. కొమురమ్మ బుధవారం సిరిసేడులో ఉంటున్న సదయ్య అనే కుమారుడి వద్దకు చేరుకోగా కోడళ్లు రావద్దంటూ వెళ్లగొట్టారు. దీంతో ఆమె ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా అక్కడ ఉన్న సిబ్బంది కొడుకుకు ఫోన్‌చేసి పిలిపించారు.

సదయ్య ఠాణాకు చేరుకొని సిబ్బందితో మాట్లాడుతూ నేను ఒక్కడినే కాదు ఇంక ముగ్గురు ఉన్నారు. వారు కూడా రావాలని సమాధానం ఇచ్చాడు. ఎస్‌ఐ రాజకుమార్ వెంటనే కోడళ్లతో మాట్లాడి మీ అత్తమ్మ కొమురమ్మ మీ ఇంటికి వస్తుంది. ఆమెను సాకాలని మిగతా కొడుకులను పిలిపించి మాట్లాడుతానని చెప్పి సిరిసేడులో ఉంటున్న కొడుకు వద్దకు పంపించారు.



పోలీస్‌స్టేషన్‌లో వృద్ధురాలు కొమురమ్మ

సంక్షిప్త సమాచారం

పెద్దపల్లిటౌన్ : పట్టణంలోని పెద్దమ్మ నగర్‌కు చెందిన నూనె రాజ్‌కుమార్ అనారోగ్యంతో మృతిచెందగా విజ్ఞన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం వినోద్‌రెడ్డి బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం వితరణ చేసారు. నూనె పరమేశ్వర్, మల్లేష్, మొండయ్య, నర్సయ్య, అహ్మద్‌లున్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంలోని జడ్‌పీహెచ్‌ఎస్ ప్రాథమిక పాఠశాలలకు కేశెట్టి అపర్ణరాఘవేంద్రలు గ్యాస్ సిలిండర్లు‌స్టౌవ్‌లు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు గంగ్ర దేవేందర్‌రావు, జ్ఞానేశ్వర్, మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీష్‌బాబు, కవ్వంపల్లి నారాయణ, సదానందం, అంజిబాబు, నరేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఖని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో బుధవారం హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ కట్కూరి శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇజ్రాయిల్, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో బుధవారం వ్యక్తిత్వ వికాసంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస ట్రైనర్ సయ్యం సాయిబాబు హాజరై మాట్లాడుతూ సెల్‌ఫోన్, టెక్నాలాజీలను అభివృద్ధి చెందేందుకు ఉపయోగించుకోవాలని, వాటికి బానిసలుగా మారవద్దన్నారు. అనంతరం ట్రైనర్ సాయిబాబును సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరోగ్య మేరి, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ : కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీపీసీలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు మట్టి సేకరణ, భూసార పరీక్షలపై అధికారులు శిక్షణనిచ్చారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనాథ్, కృషి విజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్త కిరణ్ వ్యవసాయ క్షేత్రంలో మట్టి నమూనాల సేకరణ, నమూనాల సారంపై పరీక్ష విధానాన్ని వివరించారు. ఎంఏవో ప్రకాష్, ఊఈవో ప్రత్యూష, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యకుమారి, పద్మ, కావ్య పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కటకం రమేష్ పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లో క్షేత్రస్థాయి సమస్యలు తదితర అంశాలపై వివిధ పాఠశాలల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్‌రావు, గుర్రం శ్రీనివాస్ గౌడ్, బాధ్యులు రవికుమార్, రవీందర్‌రావు, తహర్ ఇక్బాల్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్ : అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఏబీవీపీ నాయకుడు అజయ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏబీవీపీ నాయకులను అరెస్ట్ చేసి అర్ధరాత్రి జైలుకు పంపారన్నారు. వెంటనే వీసీల నియామకం చేపట్టకపోతే సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబెర్ అంజన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు, రంజిత్ ,రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని గంగానగర్‌లో నివాసముంటున్న పైడి సతీష్ అనారోగ్యంతో మృతిచెందాడు. దహన సంస్కారాలు నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో కాలనీవాసులు నీడ సంస్థకు తెలిపారు. అధ్యక్షుడు పల్లెర్ల రమేష్ రూ.6వేలు, దాతల సహకారంతో మరో 6వేలు, సీతారామ సేవా సమితి 5వేలు, ఎన్‌ఆర్‌ఐ పంజాల సతీష్ రూ.5వేలు మొత్తం 22వేలు మృతుడి కుటుంబానికి అందజేశారు. అనురాజ్, కాటు రవి, రమ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనేక సమస్యలు పేరుకపోయిన, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి, పరిష్కారం చూపాలని కోరుతూ మండల ప్రత్యేకాధికారి దోమ ఆదిరెడ్డికి బుధవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, సీతఈ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీమల్లు, మండల బీజేపీ అధ్యక్షుడు అజయ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్, యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు భూమయ్యలు వినతిపత్రం సమర్పించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీకాంత్ కాల్వ శ్రీరాంపూర్ మండలం మడిపల్లికి బదిలీఅయ్యారు. బుధవారం ముత్తారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ ఎద్దు కుమారస్వామి, మాజీ వార్డు సభ్యుడు సత్కరించారు. నూతనంగా విధుల్లో చేరిన శ్రీనివాస్‌ను స్వాగతం పలుకుతూ సన్మానించారు.

కళ్యాణ్‌నగర్ : రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని సిక్కువాడలో ఉచితంగా 200మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కంజపురం రాజేందర్, బంక రామస్వామి, గుండా వీరేశం, గుమ్మడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓదెల : నేత్ర, అవయవదానంలో సదాశయ ఫౌండేషన్ సేవలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి, ఓదెలను ఆదర్శ గ్రామంగా అవార్డు ప్రకటించాలని ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి కోరారు. బుధవారం బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు రవికాంత్ ప్రదీప్ కుమార్‌ను ఓదెలలో ఫౌండేషన్ నిర్వాహకులు కలిశారు. అనంతరం రవికాంత్ ప్రదీప్ కుమార్ ఫౌండేషన్ ప్రతులను ఆవిష్కరించారు. సినీ నటుడు శివారెడ్డి, ఎన్నారై దుర్గప్రసాద్, ఆర్టిస్ట్ భాస్కర్ల వాసు, క్యాతం వెంకన్న, సారంగం, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు, మల్లేశం, పిట్టల నర్సింగం పాల్గొన్నారు.

భూకేటాయింపులు పకడ్బందీగా జరగాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మంథని పట్టణంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మంథని, సెప్టెంబరు 11:మంథని పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన భూ కేటాయింపులు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పట్టణంలోని, శివారు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను కలెక్టర్ శ్రీహర్ష జేసీ అరుణశ్రీతో కలిసి బర్రెకుంట, బాయ్స్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, ఏఎంసీ సమీపంలోని దేవదాయ శాఖ, డిగ్రీ కళాశాల సమీపంలోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాత డపింగ్ యార్డులో లెవలింగ్ పనులు చేపట్టాలన్నారు. పట్టణంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం, నూతన మున్సిపల్ భవన నిర్మాణం, సబ్‌స్టేషన్, ఆర్డీవో, తహసీల్దార్ ఆఫీసుల నిర్మాణాల కోసం అనువైన ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల స్కెచ్‌లను పూర్తి చేసి, ఏ అభివృద్ధి కార్యక్రమానికి ఎక్కడ వీలుగా ఉంటుందో నివేదిక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హనుమానాయక్, ల్యాండ్ సర్వే ఏడీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

పట్టాదారుల పేర్లు ధరణిలో నమోదు చేయండి

రామగిరి, సెప్టెంబరు 11: మండలంలోని బుధవారంపేట్ రైతులకు పట్టాలను ధరణిలో నమోదు చేపట్టాలని కలెక్టర్ శ్రీహర్ష మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని గ్రామ రైతులతో కలెక్టర్ భేటీ అయ్యారు. రెవెన్యూ గ్రామ శివారులో సింగరేణి చేపట్టిన భూసేకరణ అవార్డు రద్దు అయిన నేపథ్యంలో రైతులతో రెవెన్యూపరమైన సమస్యలను చర్చించి 708.16 గుంటల భూమి టిమ్-33 మాడ్యూల్ ద్వారా రైతుల వద్ద దరఖాస్తులు స్వీకరించి పట్టాదారుల పేర్లను ధరణిలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాంచందర్‌రావు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ, ఏసీపీ



గోదావరి వంతెన వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ



గోదావరినది తీరాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రమేష్, అధికారులు

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 11: గణేష్ నిమజ్జన శోభయాత్ర ఏర్పాట్లను బుధవారం రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పరిశీలించారు. నిమజ్జనం జరగనున్న గోదావరి వంతెన వద్ద బందోబస్తు ఏర్పాట్లు, లైటింగ్, గజ ఈతగాళ్ళు, మంచినీటి వసతి ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదావరిఖనితో పాటు మంచిర్యాల, శ్రీరాంపూర్, జైపూర్, రామకృష్ణాపూర్ ప్రాంతాల నుంచి గణపతి ప్రతిమలను నిజమజ్జనానికి తీసుకురానున్న దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాల రూట్ క్లియర్, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలను సీపీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి సంబంధించి అన్నిప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. కమిషనర్ వెంట మంచిర్యాల డీసీపీ భాస్కర్, రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, ఏసీపీలు రమేష్, వెంకటేశ్వర్లు, గోదావరిఖని వన్‌టౌన్ టూటౌన్, శ్రీరాంపూర్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాదరావు, మోహన్‌తో పాటు మున్సిపల్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జనాన్ని ప్రశాంతగా జరుపుకోవాలి

మంథని, సెప్టెంబరు 11: నవరాత్రుల్లో భక్తిశ్రద్ధలతో పూజించిన భక్తులు వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ సూచించారు. స్థానిక గోదావరినదీతీరంలో వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను, స్థలాన్ని ఆర్డీవో హనుమానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమసురేష్‌రెడ్డి, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి బుధవారం ఏసీపీ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, స్పష్టమైన లైటింగ్, తాగునీరు, భోజన వసతి ఏర్పాట్లుచేయాలని సూచించారు. శోభాయాత్రతో నిమజ్జనానికి భారీగా మంథని గోదావరినది తీరానికి వచ్చే వాహనాల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా రూట్‌మ్యాప్, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ రాజయ్య, సీఐ రాజు, ఎస్ఐ రమేష్, మున్సిపల్ కమీషనర్ మల్లిఖార్జున్‌లు ఉన్నారు.

పారిశుధ్య బాధ్యత పంచాయతీ సిబ్బందిదే.. : డీపీవో

కమాన్‌పూర్, సెప్టెంబరు 11 : ప్రతి గ్రామంలోని పారిశుధ్యం, శుభ్రత బాధ్యత పంచాయతీ సిబ్బందిదేనని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామకార్యదర్శులు, కారోబార్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయించాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. ఇంటి పన్నులు, నల్లా పన్నులు వసూలు చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో జ్వరాలు ప్రబులుతున్నాయని, దోమలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో లలిత, ఎంపీవో కాట భాస్కర్, కార్యదర్శులు జంజర్ల అమల, రామ్మోహన్, బచ్చల భాస్కర్, మల్యారి తిరుపతి, అంబటి శంకర్, సాయిశ్రీ, అమీనా భాను కారోబార్లు ఉన్నారు.

ఓపెన్ డిగ్రీ సెమిస్టర్ ఫీజు చెల్లించండి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 11:ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్‌సీ విద్యార్థులు రెండవ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలని, ఈనెల 20 చివరి తేది అని గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జైకిషన్‌ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.150చొప్పున, బీఎస్‌సీ, బీకాం కంప్యూటర్(సైన్స్) విద్యార్థులు అదనంగా ల్యాబ్ ఫీజు చెల్లించాలన్నారు. ఫీజును టీఎస్ ఆన్‌లైన్, మీసేవ కేంద్రాలలో చెల్లించాలని, రెండవ సెమిస్టర్ పరీక్ష అక్టోబరు 28 నుంచి నవంబరు 4 వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని వివరించారు.

సుల్తానాబాద్‌లో గణనాథుడికి 183 రకాల మహా నైవేద్యం



సుల్తానాబాద్‌లో మహానైవేద్యం..



పెద్దపల్లి లక్ష్మినగర్‌లో పూజలు నిర్వహిస్తున్న కాలనీవాసులు



ఖనిలో బహుమతులు అందజేస్తున్న ఏసీపీ రమేష్

సుల్తానాబాద్, సెప్టెంబరు 11 : సుల్తానాబాద్ పాతబజార్ శివాలయంలో బుధవారం వినాయకునికి 183రకాల మహా నైవేద్యాన్ని సమర్పించారు. పాత బజార్లోని శివాలయంలో 5 రోజులుగా వినాయకునికి విశేష పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శివాలయంలో భక్తులు 183 రకాల నైవేద్యాలను స్వామివారికి సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ భాగ్యలక్ష్మి దంపతులతో పాటు పండితులు మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్ : జిల్లా కేంద్రంలోని లక్ష్మినగర్‌లో కొలువుదీరిన వినాయకుడి వద్ద కాలనీ వాసులు ఆ దేవుడ్ని మొత్తం పూలతో అలంకిరించి బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఐదవ రోజు కాలనీకి చెందిన భక్తులు పెద్ద ఎత్తున వివిధ రకాల పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

కోల్‌సిటీ : గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. బుధవారం రాత్రి గోదావరిఖని కోదండ రామాలయంలో గణపతులకు నంబర్ల కేటాయింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై డ్రా తీశారు. గత సంవత్సరం వివిధ వేషధారణలతో వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న పలువురు మండపాల నిర్వాహకులకు ఏసీపీ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి అయోధ్య రవీందర్, ఉత్సవ సమితి అధ్యక్షులు కుర్మ సతీష్, ఆరెల్లి జలేందర్, చక్రపాణి, ఇసంపల్లి వెంకన్న, రవీందర్, వెంకటస్వామి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్‌పై సమీక్షా సమావేశం



అధికారులతో చర్చిస్తున్న ఆర్జీ-2 జీఎం

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 11: స్వచ్ఛతా క్యాంపెయిన్ 4.0పై బుధవారం ఆర్జీ-2 ఏరియా ముఖ్య అధికారులతో జీఎం సూర్యనారాయణ సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో నిర్వహిస్తున్న విధంగా సెప్టెంబరు 16 నుంచి 30 వరకు, అక్టోబరు 2 నుండి 31వ తేదీ వరకు సింగరేణి వ్యాప్తంగా జరగనున్నాయన్నారు. ఏరియా పరిధిలో కార్యక్రమానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని జీఎం అధికారులకు సూచించారు. కార్యాలయాల శుభ్రత, సుందరీకరణ, చెత్తను గుర్తించి తొలగించడం, రికార్డులను భద్రపరచడం వంటి అంశాలపై అధికారులో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీఓ మధుసూదన్, అఫిషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్‌కుమార్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, అధికారులు రాజేంద్రప్రసాద్, ఎర్రన్న, ధనుంజయ, సృజన్‌మెహ్రా, సురేష్‌బాబు, బూక్య దేశాయి, డాక్టర్ మహిపాల్ పాల్గొన్నారు.

ఓసీపీ-3 సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 11: ఓసీపీ-3 ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 100 టన్ను డంపర్ పార్కింగ్ యార్డును వెడల్పు చేసి, ఆపరేటర్ల ఇబ్బందులను తీర్చాలని కోరారు. పార్కింగ్ యార్డులో లైటింగ్ మెరుగు పరచాలని, పార్కింగ్ యార్డులో బయో టాయిలెటర్లు ఏర్పాటు చేసి, బ్లోయర్ మరమ్మత్తులు చేసి డంపర్ల క్లీనింగ్‌కు వినియోగించాలని కోరారు. డంపర్ గ్లాస్ క్లీనింగ్ కోసం నీటి ట్యాంక్ ఏర్పాటు చేయాలని, నాలుగు మస్టర్లు ఉన్న కార్మికుడికి ప్లేడే ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, పిట్ సెక్రెటరీ ప్రసాద్, నాయకులు సంపత్‌రెడ్డి, లింగమూర్తి, భీముని సత్యం, ఆకుల రాజయ్య, రవీందర్, ఓదేలు, లక్ష్మణరావు, అవినాష్, ఉస్మాన్, రమేష్‌రెడ్డి ఉన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యంరావు

రామగిరి, సెప్టెంబరు 11: సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణ ముప్పు పొంచి ఉందన్నారు. యూనియన్‌లు ఏ మాత్రం అలసత్వం వహించిన ప్రైవేట్‌పరంగా కావడం ఖాయమని హెచ్చరించారు. అన్ని యూనియన్లు సమష్టిగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో నాయకులు సీఐటీయూ నాయకులు దొమ్మటి కొంరయ్య, కుమార్, అహ్మద్, వేణుగోపాల్, శ్రీనివాస్, రాయమల్లు, మీనయ్య, కామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిన బెల్టు క్లీనింగ్ కార్మికులు

రామగిరి, సెప్టెంబరు 11: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలో పని చేసే 72 మంది బెల్టు క్లీనింగ్ కాంట్రాక్టు కార్మికులు బుధవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. యూనియన్‌లో చేరిన కార్మికులను ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు ఉడుతా శంకర్ యాదవ్ యూనియన్ కండువా కప్పి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



మక్కాన్‌సింగ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లారీ అసోసియేషన్ నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 11: రామగుండం లారీ యజమానుల సంక్షేమ సంఘం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చిత్రపటానికి బుధవారం గోదావరిఖని చౌరస్తాలో లారీ యజమానుల సంక్షేమ సంఘం క్షీరాభిషేకం నిర్వహించింది. ఈసందర్భంగా అధ్యక్షుడు కందూరు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా లోడ్‌లకు స్థానిక లారీలకు ఎమ్మెల్యే అవకాశం కల్పించారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఐకేపీ సెంటర్ల నుంచి వడ్ల రవాణాకు సంబంధిత అధికారులతో మాట్లాడారని, ఎన్‌టీపీసీ, సింగరేణి బొగ్గు లోడ్‌కు అవకాశం కల్పించారన్నారు. ఈకార్యక్రమంలో లారీ అసోసియేషన్ నాయకులు సంతోష్‌రావు, దామోదర్‌రెడ్డి, బాబురావు, నర్సింహారెడ్డి, బొద్దుల శ్రీనివాస్, సతీష్, హరీష్, శ్రీనివాస్, నవీన్, పాండురంగారావు, ఆసిఫ్, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, దాసరి విజయ్, గుంపుల తిరుపతి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు11: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దపల్లి నియోజకవర్గానికి సంబంధించి పలు సమస్యలపై, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 11: రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక జెండా చౌరస్తాలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. హైదరాబాద్‌లోని కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ యూనివర్సిటీగా నామకరణం చేయడంపై పట్టణంలో స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బొడ్డుపల్లి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ బుధగడ సంపత్, తాడూరి శ్రీమన్, టి సుభాష్‌రావు, దొడ్డుపల్లి జగదీష్, బొడ్డుపల్లి అశోక్, కృష్ణ, రాచమల్ల సతీష్, గుడికందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 11 : మహిళలు బ్యాంకు లింకేజీ ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ సీసీ రజిత అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో వీవో మొదటి సమావేశానికి సీసీ రజిత హాజరై మహిళ సంఘాల సభ్యులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను వినియోగించుకోవాలన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలను వృథా చేయకుండా ఏదైనా వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వీవోలు, మహిళ సంఘాల సభ్యురాళ్లు పాల్గొన్నారు.

'రాహుల్‌గాంధీ విద్వేష పూరిత వ్యాఖ్యలు సిగ్గుచేటు'

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 11: ప్రపంచ మీడియాలో ప్రచారం కోసం రాహుల్‌గాంధీ విద్వేషపూర్తి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం సురేష్‌రెడ్డి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో దేశప్రధాని నరేంద్రమోదీకి, భారత దేశానికి వ్యతిరేకంగా ప్రసంగాలు చేయడం రాహుల్‌గాంధీ నీతిమాలిన చర్యలకు నిదర్శనమన్నారు. దేశ ప్రతిష్టను పెంచాల్సిన రాహుల్‌గాంధీ దేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

కరాటేలో ఖని విద్యార్థి ప్రతిభ



విద్యార్థి ధీమన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రజిని

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 11: ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గోదావరిఖని నారాయణస్కూల్‌కు చెందిన కత్రోజు ధీమన్ ఆల్ కలర్స్ బెల్ట్ విభాగంలో కటాస్, కుమితి విభాగంలో బంగారు, కాంస్య పతకాలు సాధించాడు. ధీమన్ తండ్రి కత్రోజు మోహన్‌బాబు సింగరేణి ఆర్జీ-1లో ఉద్యోగి. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన ధీమన్‌ను బుధవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ రజిని అభినందించారు.

వినోబా భావే జయంతి

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 11: కాలనీలో ఈవీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం వినోబా భావే జయంతి నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ ఇరికి మహేష్ వినోబాభావే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నేటితరం రాజకీయ నాయకులు వినోబా భావేను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఈకార్యక్రమంలో మూకిరి రాజు, బీ వెంకటేష్, రౌతు రమేష్, పూజారి సాయిలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

కమాన్‌పూర్, సెప్టెంబరు 11 : కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. బుధవారం గ్రామంలోని ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి ఆదిరెడ్డికి వినతిపత్రం సమర్పించగా ఆయన అప్పటికప్పుడే జిల్లా వైద్యాధికారితో మాట్లాడారు. కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు నెలకొన్నాయని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే డీఎంహెచ్‌వో ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండి రోగులను పరీక్షిస్తారని, అలాగే మందుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట నల్లవెల్లి శంకర్, మత్స్యగిరి రాము, గుర్రం లక్ష్మీమల్లు, తోట రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈవో కవిత

జూలపల్లి, సెప్టెంబరు 11: క్రీడలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మండల విద్యాధికారి కవిత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ క్రీడల్లో పాఠశాలల బాలికల క్రీడల ఎంపిక పోటీలను ఎంఈఓ కవిత జెండా ఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మహేందర్, రమేష్, సురేష్, సరస్వతి పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.